క్లుప్తంగా

ఇంటి వద్దకే పశువైద్యం



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వెంకట సుబ్బయ్య

రాచర్ల: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య పశు సంచార వాహనం ద్వారా ఇంటి వద్దే పశువులకు వైద్యం అందిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ మార్కాపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని అనుమలవీడులోని పశువైద్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు వచ్చే నీలి నాలుక, గాలికుంటు, చిటుకు వ్యాధులకు ఇప్పటికే వ్యాక్సిన్ వేయించినట్లు పేర్కొన్నారు. వేసవి కాలంలో పశువులు మేతకు, తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలుగా తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. అనుమలవీడు పశువైద్యాధికారి చక్రవర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలి

మార్కాపురం: తూర్పు రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించి పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ నాయకులు డీవీఆర్, కుందూరు సుబ్బారెడ్డి, గౌస్ మోహిద్దీన్, మస్తాన్‌వలి, నారాయణ పాల్గొన్నారు.

చిన్నారుట్లలో వైద్యశిబిరం



గిరిజనులను పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చింతల వైద్యాధికారి డాక్టర్ యగ్నిక్, సాయి ప్రశాంతిలు గూడెంల వాసులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గూడెంలోని గిరిజన గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఐరన్‌ఫోలిక్, మల్టీవిటమిన్, క్యాల్షియం ట్యాబ్లెట్‌లను అందజేశారు. ఈ వైద్యశిబిరంలో నాగార్జుననాయక్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనువాసులు, ఏఎన్ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి గ్రామాన్ని వారే అభివృద్ధి చేసుకోవాలి



మొక్కలు నాటుతున్న డీపీఓ నారాయణరెడ్డి

దొనకొండ: ఎవరి గ్రామాన్ని వారే అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని చందవరం పంచాయతీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేస్తే పంచాయతీ అభివృద్ధికి వీలుంటుందన్నారు. పలు వీధుల్లో పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్యం గురించి అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలన్నారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, ఉప సర్పంచ్ చెంచిరెడ్డి, ఎంపీటీసీ బండారు రాజు, ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, కార్యదర్శి నాగార్జున్ పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్ల

కురిచేడు: మండలంలోని దేకనకొండ, బయ్యవరం, పెద్దవరం గ్రామాల కూడలిలోని సింగరయ్య కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్ల బుధవారం అత్యంత వైభవంగా జరగనుంది. స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్లను కూడా అదే రోజు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేకనకొండ గ్రామంలోని సింగరయ్య కొండవద్ద శ్రీయోగానంద లక్ష్మీనృసింహ స్వామి నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తిరునాళ్లలో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, భోజన వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యం



స్టడీ అవర్‌లో ముండ్లమూరు ఆదర్శ మోడల్ కళాశాల విద్యార్థులు



చదువుకుంటున్న తాళ్లూరు వీకే కళాశాల ఇంటర్ విద్యార్థినులు

- ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు

దర్శి టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వాహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి ఇప్పటికే ప్రధాన ప్రాక్టికల్ పరీక్షలు ముగిశాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 7వ తేదీన ముగియనున్నాయి. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. లెక్చరర్లు వారికి తోడుగా నిలుస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థి భవిష్యత్‌ను ఇంటర్ మార్కులే నిర్ణయిస్తాయి. మంచి మార్కులు వస్తే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 258 ప్రభుత్వ, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 58,945 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 27,989 మంది ఉండగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 30,956 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 95 పరీక్ష కేంద్రాల్లో ఏప్రియల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి.

హైపవర్ కమిటీ ఏర్పాటు

కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఇంటర్ పరీక్షల నిర్వహణకు హైపవర్ కమిటీని నియమించారు. కమిటీలో కలెక్టర్, ఎస్పీ, ఇంటర్ విద్య ఆర్జేడీ, డీవీఈఓ, సీనియర్ ప్రిన్సిపాల్, ఒక సబ్జెక్టు లెక్చరర్ ఉంటారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయి ఆర్ఐఓ కన్వీనర్‌గా, ఇద్దరు సీనియర్ ప్రిన్సిపాల్స్, ఇద్దరు లెక్చరర్స్‌ను నియమించారు. నాలుగు ఫ్లయిగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుంది.

ఆందోళనను వీడాలి



ఆందోళనను పూర్తిగా విడనాడాలి. ఎక్కువ మోడల్ ప్రశ్న పత్రాలు రాయడం ద్వారా తప్పులు ముందుగానే తెలుస్తాయి. పరీక్ష సమయంలో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. పరీక్షలు అతి సమీపంలో ఉన్న నేపథ్యంలో ఇప్పటికే చదవని కొత్త ప్రశ్నలు చదవడాన్ని విడనాడాలి. చదివిన పాఠ్యాంశాలను వీలైనంత ఎక్కువ సేపు పునరుశ్చరణ చేసుకోవాలి.

– తారక్‌నాథ్, ప్రిన్సిపాల్, వీకే జేసీ, తాళ్లూరు

పరీక్షల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి



మార్చి 15 నుంచి ఏప్రియల్ 4 వరకు ఇంటర్ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసాం. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. థియరీ పరీక్షలకు 95 పరీక్ష కేంద్రాల్లో 58,945 మంది హాజరు కానున్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలలకు మంచి పేరు తేవాలి. ఆరోగ్యం జాగ్రత్తంగా చూసుకుంటే ఇబ్బందులు ఉండవు.

– సైమన్ విక్టర్, ఆర్ఐఓ

ప్రత్యేక శిక్షణ ఎంతో ఉపయోగం



ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కార్పొరేట్ కళాశాలల్లో ఇబ్బందులు పడేకంటే ప్రభుత్వ కళాశాలల్లో మంచి లెక్చరర్లు నిత్యం పర్యవేక్షిస్తూ మా ఉన్నతికి కష్టపడుతున్నారు. వారి శిక్షణలో పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులు సాధిస్తా.

– జి.జైష్ణవి, ఎంపీసీ, సీనియర్ ఇంటర్, ముండ్లమూరు

ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు



ఆందోళన వీడి మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి. విద్యార్థులు పరీక్షలకు ముందు శారీరకంగా బాగా అలసిపోతారు. ఆరోగ్యంగా ఉంటేనే పరీక్షలను సమర్థంగా ఎదుర్కోగలమని తెలుసుకోవాలి. పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలి. తక్కువ తక్కువగా ఎక్కువ సార్లు తినాలి. కూరగాయలు, పండ్లు, రసాలు, గుడ్లు వంటివి తినటం శ్రేయస్కరం.

– ఎం.జీవన్, న్యూరాలజిస్ట్, ఒంగోలు

ఘనంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

చీరాల టౌన్: మండలంలోని ఈపూరుపాలెంలో కొలువై ఉన్న అంకమ్మతల్లి వార్షికోత్సవం మంగళవారంతో వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారి గ్రామ పర్యటన, జల బిందెలు, పసుపు కుంకుమ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడకల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు. అనంతరం అంకమ్మ దేవర నగరోత్సవాన్ని బాణాసంచాల కాల్పులు, కనక తప్పెట్లు, కళాకారుల నృత్యాలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లసేవ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను సేవా భక్తులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: పట్టణంలో కుక్కలు, ఆవుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కుక్కలు మనుషులపై దాడులు చేస్తున్నాయని, ఆవులు రోడ్డుపై ఉండి ట్రాఫిక్ సమస్యకు కారణమతున్నాయని, ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ కౌన్సిల్ సమావేశంలో కోరారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ బాలమురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఇస్మాయిల్ మాట్లాడుతూ రాత్రి బైకులపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయని తెలిపారు. కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌తో పాటు కుక్కల ఉత్పత్తి తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏబీఎం ఆస్తులపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై వివరణ కావాలని ఇస్మాయిల్ కోరగా హైకోర్టు నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని కమిషనర్ స్పష్టం చేశారు. తమ వార్డులో పైప్ లైన్‌లో మురుగు నీరు వస్తుందని, కొత్త లైన్ వేయాలని కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి కోరారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చైర్మన్ అన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

చీరాల: పలు స్టేషన్ల పరిధిలో పోలీసుల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. చీరాల రూరల్, చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం గోవా నుంచి తెచ్చిన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట పంచాయతీ, ప్రసాద్‌నగర్, వేటపాలెం మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురి వద్ద నుంచి 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ తెలిపారు. అలానే చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం బుర్లవారిపాలెం అడ్డరోడ్డు వద్ద 40 మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

సంక్షిప్తంగా

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కురిచేడు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీ రమణ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 24వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి వారికి, సాయంత్రం 2 గంటల నుంచి 4.30 వరకు ఇంటర్ వారికి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన కేజీబీవీ ఉద్యోగులు

పుల్లలచెరువు: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను మంగళవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర కేజీబీవీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ లిల్లీప్రకాశ్‌వాణి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ లిల్లీప్రకాశ్‌వాణి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కేజీబీవీల్లో పనిచేస్తున్నామని మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేసేలా చూడాలని కోరినట్లుగా ఆమె తెలిపారు. స్పందించిన ఆయన ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు ఆమె తెలిపారు.

రెడ్డిచెర్ల చెరువు తనిఖీ

కొమరోలు: రెడ్డిచెర్లలోని ఇరిగేషన్ చెరువును రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్డిచెర్ల చెరువును తనిఖీ చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం ఖలీల్ తెలిపారు. రెడ్డిచెర్ల చెరువు నుంచి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందిన దృష్ట్యా చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా అక్రమంగా మట్టిని రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీరి వెంట ఇరిగేషన్ ఏఈ విశ్వనాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దొనకొండ: మండలంలోని చందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టారు. భోజనం రుచి చూశారు. కుకింగ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, ఎంపీడీఓ వసంతరావునాయక్ ఉన్నారు.

రూ.3.26 లక్షల ఆర్థిక సాయం

బేస్తవారిపేట: మండలంలోని చెరుకుపల్లెకు చెందిన జి.బాలకేశి గిద్దలూరులో ఎంపీఈఓగా పనిచేస్తూ మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సమయంలో ఈ నెల 22వ తేదీన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. జిల్లాలోని వ్యవసాయాధికారులు, రైతు భరోసా, సచివాలయ సిబ్బంది మానవత్వంతో స్పందించారు. రూ.3,26,803 నగదును బాలకేశి తండ్రి చెన్నకృష్ణయ్య, అన్న చెన్నరాయుడులకు మంగళవారం వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అందజేశారు.



చెన్నకృష్ణయ్యకు నగదు అందజేస్తున్న ఏఓ మెర్సీ

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని సమాజానికి అవసరమయ్యే పరిశోధనలు చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా మండలంలోని రాయవరం గురుకుల పాఠశాల విద్యార్థినులతో ఆయన సమావేశమయ్యారు. సైన్స్‌పై ఇంట్రెస్ట్ పెంచుకోవాలన్నారు. 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తావాలని ఎమ్మెల్యే కేపీ ఆకాంక్షించారు.

పెద్దారవీడు: దేశాభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు నిరంతరం పరిశోధన అవసరమని ఎంఈఓ పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలో పుచ్చకాయలపల్లె గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం చందలూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక పరిశోధనలు, సైన్స్ క్విజ్, సెమినార్ నిర్వహించారు.

యర్రగొండపాలెం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ఎంపీడీవో ఎం.రామసుబ్బరాయుడు, ఎంఈవో పి.ఆంజనేయులు, కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తిరుమలదేవి పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ

పుల్లలచెరువు: నేటి విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు కావాలని పుల్లలచెరువు జెడ్పీ స్కూల్ హెచ్ఎం ఉమామహేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. జెడ్పీ, కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీవీ రామన్ చిత్రపటానికి ముందుగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు.

తాళ్లూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నాగంబొట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన పెంచుకుని అర్థం చేసుకుంటే సైన్స్ మరింత సులభమవుతోందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన 'భూమిని రక్షించుకుందాం' నాటికను రైతులు ఆసక్తిగా తిలకించారు. ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఎలీషా కుమారిలు విజేతలకు బహుమతులు అందించారు.

తర్లుపాడు: కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయ-2 లో సైన్స్ డేవేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నవోదయ విద్యాలయ సమితి రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లు విద్యార్థుల్లోని ఆలోచన శక్తిని పెంపొందిస్తాయని, వారి వికాసానికి తొడ్పడతాయని చెప్పారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విద్యార్థులకు షీల్డ్, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఈఓ డి.సుజాత, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, నేషనల్ అవార్డు గ్రహీత జగన్నాథ్, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలపై అసత్య ఆరోపణలు



విలేకరులతో మాట్లాడుతున్న బాషా, ఖలీల్

మార్కాపురం: పట్టణ శివారులోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై తాము నివాసం ఉంటున్న ఇళ్లను భూ యజమానులకు అమ్మి వారి నుంచి డబ్బులు తీసుకున్నామని, ఈ విషయంలో రెండు రోజులుగా పచ్చ పత్రికలు, ఛానల్స్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు తమను బెదిరించి స్థలాలు లాక్కున్నట్లుగా వస్తున్న వార్తలు అవాస్తవాలని, వాటిని ప్రజలు నమ్మవద్దని అక్కడి గృహాల్లో నివాసం ఉన్న షేక్ ఖాదర్‌బీ, మహబూబ్ బాషా, రహమున్నీసా, మున్వర్, ఖలీల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. కళాశాల ఎదురుగా తాము రోడ్డుపై ఇళ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమ ఇంటి వెనుకున్న పొలాన్ని వేరేవాళ్లు కొనుగోలు చేశారని, మధ్యవర్తుల ద్వారా తమ ఇళ్ల స్థలాలు కూడా కావాలని కోరగా తాము వారి దగ్గర నుంచి డబ్బులు తీసుకుని తమ స్థలాలు ఇచ్చామని, అయితే ఒక వ్యక్తి మాత్రం ఎక్కువ డబ్బులు కావాలన్న ఆశతో అనవసరంగా వైఎస్సార్ సీపీ నేతలపై నిందలు వేసి అసత్య ప్రచారం చేశాడన్నారు. తాము ఇష్టపూర్వకంగానే భూములు కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుని స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేశామని, వైఎస్సార్ సీపీ నాయకులు ఎవరూ ఒత్తిడి, బెదిరింపులు తమపై చేయలేదని స్పష్టం చేశారు. దుష్ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులను కోరారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నేతలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని, మొదటి ప్రాధాన్యం ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్ల ముందు–1 వేయించాలని చెప్పారు. కౌన్సిలర్లు, గృహసారథులు, వార్డు అధ్యక్షులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. పది రోజుల పాటు కష్టపడి మంచి మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్య నాయకులందరూ ప్రచారంలో పాల్గొనాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు సమాచారం అందించి ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లానే ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యం వద్దన్నారు. పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన డెవలప్‌మెంట్‌ను ఉపాధ్యాయులు వివరించాలన్నారు. రాష్ట్రంలో కొన్నేళ్లుగా పండిట్‌లకు ప్రమోషన్లు లేవని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు పది వేల మంది తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ పండిట్‌లకు ప్రమోషన్లు ఇచ్చిన విషయాన్ని వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

బేస్తవారిపేట: స్థానిక పాత పోస్టాఫీసు సమీపంలో టైలర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్ హోవే, టైలర్స్‌డే సృష్టికర్త కేపం స్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో టైలర్స్ ర్యాలీ నిర్వహించారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ శాంతికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్, టైలర్స్ సొసైటీ అధ్యక్షుడు డి.కాశీంపీరా, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శులు రమణ, కాశింవలి పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైదన సాల్మన్ ఆధ్వర్యంలో మంగళవారం దర్జీలు ఘనంగా ప్రపంచ దర్జీల దినోత్సవం నిర్వహించారు. కుట్టుమిషన్ పితామహుడు విలియమ్స్ హోవే చిత్రపటానికి టైలర్స్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాల్మన్ మాట్లాడారు. వైస్ ప్రెసిడెంట్ దాదాబాషా, సెక్రటరీ గురుమూర్తి కోశాధికారి బాలసుబ్బారావు, సీనియర్ టైలర్లు పసుపుల ప్రభాకర్, బొర్రారెడ్డి, కర్నా హనుమయ్య, ఎజ్రానీ, శేఖర్ పాల్గొన్నారు.

టైలర్స్ కోసం ప్రత్యేకంగా పథకాలు

త్రిపురాంతకం: ప్రభుత్వం టైలర్స్ కోసం ప్రత్యేకంగా పథకాలు పెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తోందని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకంలో టైలర్స్‌డేను టైలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టైలర్స్ కాలనీ నిర్మాణానికి స్థలాన్ని, భవనాలను నిర్మించాలని కోరగా కాలనీ నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. టైలర్స్ అసోసియేషన్ నాయకులు వెంకట్రావు, సైద, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ ఆళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కృష్ణ, వైఎస్సార్ సీపీ కో కన్వీనర్ సీహెచ్ యల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పీ మల్లికార్జున్, రంగబాబు, బాలకోటిరెడ్డి, టీడీపీ నాయకుడు వల్లరాజు, సీపీఐ నాయకులు డీ శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని టైలర్లకు ముఖ్యమంత్రి జగనన్న చేదోడు పథకంతో ఎంతో చేయూతనిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు. టైలర్స్‌డేను పురస్కరించుకుని మండల కేంద్రంలో దర్జీలు జరుపుకున్న సహావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, ఉపసర్పంచి దూదేకుల రసూల్, మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిమ్మని వెంకటేశ్వర్లు మండలానికి చెందిన పలువురు టైలర్లు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ఆనందోత్సవాల నడుమ టైలర్ల దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు.

కొనకనమిట్ల: దర్జీలు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని టైలర్స్ అసోసియేషన్ నాయకులు రాఘవయ్య, చెన్నారావు, చిన్న, రమణయ్యలు అన్నారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హోవే జయంతి సందర్భంగా కొనకనమిట్లలో టైలర్స్ డే నిర్వహించారు. తొలుత విలియం హోవే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. పి.చిన్న, సీహెచ్ కొండారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.